క్లుప్తంగా

విద్యార్థి విజయంతో వైద్య సేవ



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దాతలు

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వాకింగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రతి నెల ఒకటో ఆదివారం నిర్వహించే వైద్య శిబిరంలో భాగంగా ఆ సంస్థ సభ్యుడు సత్యానందం మనవరాలు అపూర్వ పేరున ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆమెకు ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో 470 మార్కులకు 465 రావడంతో ఈ సేవ చేసినట్టు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి విప్పర్తి కొండలరావు తెలిపారు. బీపీ, షుగర్‌తో పాటు వివిధ రకాల వ్యాధులకు సుమారు 200 మందికి పరీక్షలు చేశారు. పట్టణ పరిధిలోని ఆస్పత్రుల సిబ్బంది ఈ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సైపుల్లా, ఉపాధ్యక్షుడు జాన్ కెనడీ, సహాయ కార్యదర్శి నక్కా శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొని సేవలందించారు.

ముగిసిన మదుగులమ్మ జాతర



అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

సామర్లకోట: మండల పరిధిలోని హుస్సేన్‌పురం గ్రామ దేవత మదుగులమ్మ జాతర ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గత నెల 26వ తేదీ నుంచి జరుగుతున్న ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ నాయకులు అన్నదానం ఏర్పాటు చేశారు. సుమారు ఐదు వేల మందికి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

కార్మికుడికి ఆర్థిక సాయం



కార్మికుని కుటుంబానికి నగదు అందజేస్తున్న నాయకులు

పెద్దాపురం: పనిచేస్తూ ప్రమాదానికి గురైన పెయింటర్ దువ్వా వీరబాబు కుటుంబానికి పాండవగిరి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో రూ.33 వేల ఆర్థిక సాయాన్ని కార్మికుల నుంచి సేకరించి ఆదివారం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు వడ్డి సత్యనారాయణ, కార్యదర్శి యాసలపు రమేష్, కోశాధికారి కరణం ప్రసాదరావు, శెట్టి రాజుల ఆధ్వర్యంలో కార్మికుల నుంచి విరాళం సేకరించి కార్మిక కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావలసిన సంక్షేమ పథకాలు అమలు చేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. సంక్షేమ పథకాలు అమలులో లేనందున భవన నిర్మాణ కార్మికులకు ఏ పథకం రావడం లేదన్నారు. భవన నిర్మాణ పథకాలు అమలు చేయాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో 11 కేవీ డీఎస్‌ఏ ఫీడర్ మరమ్మతులు, విద్యుత్ వైర్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల వల్ల సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ ఈఈ ఎవీ ఎన్‌డీఎస్ ప్రభాకర్ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మరమ్మతుల వల్ల వీకే రాయపురం, ఉండూరు, పారిశ్రామిక ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఈ అసౌకర్యాన్ని ఆయా గ్రామాల ప్రజలు గమనించాలన్నారు.

రేషన్ సరకుల పంపిణీ ప్రారంభం



హుస్సేన్‌పురంలో రేషన్‌షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: మండల పరిధిలోని హుస్సేన్‌పురంలో రేషన్ సరకుల పంపిణీని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన రాజప్ప మాట్లాడుతూ ప్రతి నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 12, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు దుకాణాలు తెరచి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ మార్ని నాగమణి, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల వద్ద ఇక నుంచి రేషన్

పెద్దాపురం: ఇక నుంచి రేషన్ దుకాణాల వద్దే రేషన్ సరఫరా ఉంటుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. రేషన్‌షాప్ వద్ద సరుకుల అందజేత ప్రక్రియను ఆదివారం ఆయన పట్టణంలో ఆరో షాప్ వద్ద ప్రారంభించారు. గతంలో మాదిరిగా కాకుండా పదిహేను రోజుల పాటు రేషన్ పంపిణీ ఉంటుందన్నారు. అనంతరం ఆయన సరకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీరమణి, తహసీల్దార్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయ లోపమే సమస్య

- ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- ఏళ్లు గడుస్తున్నా మార్చని అధికారులు

సామర్లకోట: పెద్దాపురం-సామర్లకోట మున్సిపాలిటీల మధ్య ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ జరిగి సుమారు ఎనిమిది ఏళ్లు గడుస్తున్నా ఆ రోడ్డులో సమస్యలు పరిష్కారం కాలేదు. నిర్మాణ సమయంలో రహదారి మార్జిన్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాల్సి ఉంది. ఏళ్లు గడుస్తున్నా వాటి మార్పు జరగలేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. స్థానిక ప్రసన్నాంజనేయ ఆలయం నుంచి మఠంసెంటర్ వరకు ఉన్న నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను మార్చడానికి ట్రాన్స్కోకు ఫీజు చెల్లించాల్సి ఉంది. ఆ మొత్తం మున్సిపాలిటీ చెల్లించాలని ఆర్అండ్‌బీ అధికారులు వదిలించుకున్నారు. ఆ ఫీజులు తమ ఖాతాలో జమ కానిదే ట్రాన్సుఫార్మర్లు మార్చబోమని ఆ శాఖ అధికారులు భీష్మించుకున్నారు. దాంతో ఆ భారం రెండు మున్సిపాలిటీల మీదా పడుతోంది. ఈ రోడ్డులో ప్రమాదాల నివారణకు రహదారి నిర్మాణ సమయంలోనే సెంటర్ డివైడర్ నిర్మించారు. డివైడర్ల మధ్య ఖాళీల నుంచి వాహనాలు రోడ్డు దాటే సమయంలో సైతం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఆ ఖాళీలను మూసి వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసి రాళ్లను తొలగించేలా వత్తిడి చేశారు. దాంతో స్థానికులు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు.



పెద్దాపురం రోడ్డులో ఎస్‌బీఐ వద్ద ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఆ రెండు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అప్రమత్తం

సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో ఎస్‌బీఐ వద్ద, పాత పెట్రోలు బంకుకు ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఆయా ప్రదేశాల్లో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. స్టేట్ బ్యాంకు ఎదురుగా డివైడర్‌కు యూటర్న్ తీసుకునే సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దాంతో నిత్యం రద్దీగా ఉండే అ ప్రదేశంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పాత పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న ట్రాన్సుఫార్మర్ సమీపంలోనే రోడ్డులో యూటర్న్ ఉండటం, అక్కడే ఏటీఎం, మినరల్ వాటర్ ప్లాంటు ఉండటంతో ఆ ప్రదేశం మరింత ఇరుకుగా ఉంటుంది. ఈ మేరకు ఈ ట్రాన్సుఫార్మర్లను మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



పాత పెట్రోల్ బంకు ఎదురుగా గోతులతో ఉన్న రోడ్డులో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్లు మార్చి ప్రమాదాలు నివారించాలి...



పెద్దాపురం రోడ్డులో ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాల్సి ఉంది. రహదారి నిర్మాణ సమయంలోనే వీటిని మార్చాల్సి ఉన్నా అధికారులు జాప్యం చేస్తున్నారు. ట్రాన్సుఫార్మర్ల మార్పుకు మున్సిపాలిటీ నుంచి నిధుల చెల్లింపునకు తీర్మానం ఆమోదించి రెండేళ్లు అయింది.

– నేతల హరిబాబు, కౌన్సిలర్, సామర్లకోట

సీఎఫ్‌ఎంఎస్‌లో 200 బిల్లులు వెనక్కు వచ్చాయి



సుమారు ఏడాది నుంచి మున్సిపాలిటీ చెల్లించాల్సిన వివిధ బిల్లులకు సంబంధించి సీఎఫ్‌ఎంఎస్‌లో బిల్లులు పెట్టాము. సుమారు 200 బిల్లులు వెనుక్కు వచ్చాయి. వాటిలో ట్రాన్సుఫార్మర్ల మార్పుకు సంబందించిన ఫీజు రూ.21 లక్షలు ఉంది. ఆ బిల్లులను తిరిగి అప్‌లోడ్ చేస్తున్నాం.

– ఎ శ్రీవిద్య, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

జగ్గయ్య చెరువు కాలనీకి రేషన్

దుకాణాల ఏర్పాట్లకు మంత్రి మనోహర్ ఆదేశం



ఆదివారం సాక్షిలో వెలువడిన కథనం

పిఠాపురం: జగ్గయ్య చెరువు కాలనీలో రేషన్ షాపుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు జారీ చేశారు. 5600 మంది జనాభా గల పిఠాపురం జగ్గయ్య చెరువు కాలనీలో మూడు వార్డులకు సంబంధించిన రెండు వేల మంది రేషన్ కార్డు దారులకు రేషన్ షాపు లేక ఇబ్బందులు మొదలయ్యాయి. ఇప్పటి వరకు ఎండీయూ వాహనాల ద్వారా వారి ఇంటికే రేషన్ సరుకులు అందేవి. కాని ప్రభుత్వం ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో ఆదివారం నుంచి వారికి కష్టాలు మొదలవుతున్నాయన్న విషయాన్ని బాధితుల ఆవేదనను సాక్షి దినపత్రికలో ఆదివారం 'జనం.. పరేషన్' అనే శీర్షికన కథనం వెలువడింది. దీనిపై స్పందించిన మంత్రి మనోహర్ జగ్గయ్య చెరువు కాలనీలో మూడు వార్డులకు సంబంధించి వెంటనే రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని జేసీని ఆదేశించారు.

పెరిగిన భవన నిర్మాణ కూలి రేట్లు

సామర్లకోట: రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలను దృష్టిలో ఉంచుకుని భవన నిర్మాణ కూలీ రేట్లు పెంచవలసిన పరిస్థితి ఏర్పడిందని భవన నిర్మాణ కార్మిక సంఘ పట్టణ శాఖ అధ్యక్షుడు ప్రకృతి ఈశ్వరరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ ఒకటి నుంచి భవన నిర్మాణ రంగంలో పని చేసే వారికి సవరణ చేసిన విధంగా భవన నిర్మాణ యజమానులు కూలీ చెల్లించాలన్నారు. తాపీ మేస్త్రికి రూ.750 నుంచి రూ.800, కూలీకి రూ.700 నుంచి రూ.750కి పెంచి కూలీ రెట్లు నిర్ణయించినట్లు తెలిపారు. సంఘం నిర్ణయించిన కూలీ కంటే ఎక్కువ కూలీ వసూలు చేస్తే సీఐటీయు దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలం శ్రీనివాసు, కరణం ప్రసాదరావు, విప్పర్తి కొండలరావు, కరణం గోవింద రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు భైరవ బంగారయ్య, షేక్ బాషా, పి.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భవన నిర్మాణ సంఘ అధ్యక్షుడు

గ్రంథాలయాలతో మరింత పరిజ్ఞానం

పెద్దాపురం: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా విద్యార్థికి మరింత పరిజ్ఞానం సాధ్యపడుతుందని, శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం పుస్తక పఠనం, కథలు చదవడం నేర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సింగం బుల్లియ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న నాగరాజు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఫొటోగా తమ స్నేహాన్ని పదిలం చేసుకున్న పూర్వ విద్యార్థులు

- కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 1999-2000 బ్యాచ్ విద్యార్థుల సందడి

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 1999-2000 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. సుమారు 25 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో వారంతా కలసి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠాలు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులు కామరాజు, నాగేశ్వర రావు, వీరభద్రరావు, సత్యనారాయణ, సూర్రెడ్డి, జ్యోతుల రాంబాబులను మెమెంటో, శాలువాలతో సత్కరించారు. అందరు కలసి భోజనాలు చేశారు. ఈ ఆత్మీయ కలయికకు కృషిచేసిన సానా సత్తిరాజు, కె.ప్రకాష్, బస్వా రాజేష్, అల్లాడ సత్యనారాయణ, కామరాజులను అభినందించారు.

వెన్నుపోటు దినం రోజున కదం తొక్కుదాం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత పిలుపు

పిఠాపురం: ఈ నెల నాలుగో తేదీన వెన్నుపోటు దినం పేరుతో నిర్వహించే కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టేందుకు కదం తొక్కుదామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాయంతో పాటు కొత్తపల్లి మండలంలో ఆదివారం ఆమె వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్‌ను పార్టీశ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఏడాది పాలనలో ఒక్కహామీ నెరవేర్చని ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కూటమి ప్రభుత్వమే అన్నారు. గత ఏడాది జూన్ 4న అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ తో పాటు మరో 143 హామీలు ఇచ్చిన చంద్రబాబు ఏడాది గడిచినా ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారం వచ్చాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కూటమి నేతలు ప్రజలను నట్టేముంచారని ఆమె మండిపడ్డారు. ప్రజల పక్షాన నిలిచే వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు కూటమి ప్రభుత్వ మోసాలపై నిలదీయడానికి నిర్దేశించిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపు నిచ్చారు.

ఆ రోజు భారీ ర్యాలీ నిర్వహించి ప్రజల తరపున మన గళం ప్రభుత్వానికి వినిపించాలన్నారు. ఇప్పటికే ప్రజలు కూటమి ప్రభుత్వ మోసాలను తెలుసుకున్నారని అందరు ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిన కూటమి నేతలను నిలదీయడానికి సిద్ధంగా ఉన్న ప్రజలతో కలిసి ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని ఆమె పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. అనంతరం పార్టీ నాయకులకు కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు.



పిఠాపురంలో వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వంగా గీత ఇతర నాయకులు

వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయాలి

- ఎంపీపీ బొబ్బరాడ పిలుపు

సామర్లకోట: కూటమి నాయకులు ప్రజలకు చేసిన ద్రోహానికి నిరసనగా ఈ నెల 4వ తేదీన వెన్ను పోటు దినాన్ని నిర్వహించనున్నామని, ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు పిలుపు నిచ్చారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఆదివారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఈ మేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన వెనుపోటు దినాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ దినాన్ని సంతాప దినంగా ప్రకటించాలన్నారు. కూటమి నాయకులు చేసిన మోసాలను వెలికి తీయడానికి ప్రజాపక్షంలో పోరాడనున్నట్టు తెలిపారు. ఈ మేరకు 4న కలెక్టరేట్ ముట్టడి ఉంటుందని చెప్పారు. ఏడాది గడచినా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయక పోవడాన్ని ప్రజలు గమనించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కటి సాయి ప్రసాద్, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, సీనియర్ నాయకుడు అత్తిలి సీతారామస్వామి, పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, పట్టణ పార్టీ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, పెద్దాపురం పార్టీ అధ్యక్షుడు కాపుగంటి కామేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు మోరంపూడి రంగ నాయకులు, మాజీ ఉపాధ్యక్షుడు మోరంపూడి రమేష్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సామర్లకోటలో వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

క్రికెట్ కార్నివాల్ విజేత డైనమిక్ బాయ్స్

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు వారాలుగా జరుగుతున్న వలసపాకల క్రికెట్ కార్నివాల్ (వీసీసీ) సీజన్-4 ఆదివారంతో ముగిసింది. టెన్నిస్‌బాల్‌తో నిర్వహించిన ఈ టోర్నీలో రాయల్ వీఎస్‌పీ, డైనమిక్ బాయ్స్, బ్లాక్ అలైన్స్, ఎక్స్‌పీరియన్స్ లెజెండ్స్, వీఎస్‌పీ టైగర్స్ జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో జరిగిన మ్యాచ్‌లో డైనమిక్ బాయ్స్ విజేతగా, ఎక్స్‌పీరియన్స్ లెజెండ్స్ రన్నర్స్‌గా నిలిచాయి.

పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు

పిఠాపురం: పార్టీ కోసం కష్టపడే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, పార్టీ వారికి ఎప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శిగా ఉలవల భూషణం నియమితులైన సందర్భంగా పలువురు నాయకులు కార్యకర్తలు ఆదివారం పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వంగా గీతను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పని చేసే ప్రతి కార్యకర్తకు నాయకుడికి తగిన ప్రోత్సాహం, గుర్తింపు ఇవ్వడానికి పార్టీ అధిష్ఠానం ఎల్లప్పుడు సుముఖంగా ఉంటుందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. దళిత వర్గాలకు అండగా ఉండే వారికి ఉన్నత పదవులు ఇచ్చి తగిన గుర్తింపు ఇవ్వడం పట్ల దళిత వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయని, పార్టీ రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శి ఉలవల భూషణం అన్నారు.



వంగా గీతను గజమాలతో సత్కరిస్తున్న ఉలవల భూషణం, దళిత నాయకులు

విద్య, సాహితీ రంగాల్లో చిరంజీవిని

- ఐడియల్ కళాశాల అధినేత మృతికి పలు ప్రజా సంఘాల నివాళి

కాకినాడ సిటీ: ఐడియల్ కళాశాల అధినేత డాక్టర్ చిరంజీవినీ కుమారి మృతికి సీపీఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. చిరంజీవిని కుమారి బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. విద్య, సాహిత్య రంగాల్లో తనదైన ముద్ర వేశారని జోహార్లు అర్పించారు. కాకినాడకు సంబంధించిన సమస్యలపైన, మహిళా సమస్యలపైన ఆమె స్పందించేవారన్నారు. చర్చా గోష్టుల ద్వారా నిరంతరం ప్రజలను జాగృతం చేసేవారన్నారు. ఆమె మొదటి నుంచి వామపక్ష భావజాలంతో మెలిగారని, జన విజ్ఞాన వేదిక వంటి సైన్స్ రంగంలో బాధ్యతలు తీసుకొని పని చేశారని ప్రసాదరావు అన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



చిరంజీవినీ కుమారి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

విద్యా, సాహితీ రంగాలకు తీరని లోటు

విద్యా, సాహితీ రంగాల్లో విశిష్ట కృషి చేసిన ఐడియల్ కళాశాలల అధినేత డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మృతి సాహిత్య లోకానికి, కాకినాడ పట్టణానికి తీరని లోటని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె జీవితాంతం సమాజ సేవకు అంకితమయ్యారని అన్నారు.

ఆమె సేవలకు జోహార్లు

అనేక మంది జీవితాలను వెలుగులోకి తీసుకువచ్చిన మహానుభావురాలు, విద్యారంగానికి ఆమె చేసిన సేవలు అమోఘం, అద్వితీయమని సీపీఐ రాష్ట్ర నాయకులు తాటిపాక మధు అన్నారు. విద్యా, సాహిత్య రంగాల్లో ఆమె లేని లోటును భర్తీ చేయలేమన్నారు. ఆమె జ్ఞాపకాలు మాత్రం అందరి హృదయాల్లో చిరకాలం శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు.

యూటీఎఫ్ సంతాపం

ఐడియల్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మృతికి యూటీఎఫ్ నాయకులు చక్రవర్తి, ఐ.ప్రసాదరావు, నగేష్, సూరిబాబు, ప్రభాకర వర్మ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అభ్యుదయ భావాలు కలిగి సమాజ చైతన్యానికి తన వంతు కృషి చేశారన్నారు. యూటీఎఫ్ సభలకు వచ్చి అనేక సందేశాలు ఇచ్చారని గుర్తు చేసుకున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

కాకినాడ రూరల్: సాగర తీరాన బీచ్‌రోడ్డులో శిల్పారామం వద్ద ఆదివారం సాయంత్రం నృత్య ప్రదర్శనలు అలరించాయి. బీచ్‌కు వచ్చిన సందర్శకులు శిల్పారామంలో కొద్ది సేపు కాలక్షేపం చేసి నృత్య ప్రదర్శనలు తిలకించారు. రామచంద్రపురంలోని శ్రీలలితా నృత్య నికేతన్ గురువు వర్ధినీడి లలితా నాయుడు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ద్వారా కూచిపూడి నృత్యం నేర్చుకున్న 60 మంది చిన్నారుల్లో పలువురు శిల్పారామంలో ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే తులసీరామ్ శిష్య బృందం జానపద నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. శ్రీలలితా నృత్య నికేతన్‌లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, మెమెంటోలను శిల్పారామం వేదికగా శిల్పారామం ఆధ్వర్యంలో వర్ధినీడి వీరన్న నాయుడు బహూకరించారు. వేసవిలో శిల్పారామాన్ని సందర్శించాలని పిల్లల నుంచి పెద్దల వరకు వినోదం పొందేలా ఏర్పాట్లు చేశామని ఏఓ మోహన్‌తేజ తెలిపారు.



శిల్పారామంలో నృత్యం చేస్తున్న చిన్నారులు